

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మేలు



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : బ్రాహ్మణ యువజన వికాస్ రైతు ఉత్పత్తుల సంఘంతో గిరిజన రైతులకు పలు ప్రయోజనాలున్నాయని, ప్రతి ఒక్క గిరిజన రైతు ఈ సంఘంలో సభ్యులుగా చేరాలని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో కోఆర్డినేటర్ ఎస్. అప్పన్న ఆధ్వర్యంలో గ్రామీణ యోజన వికాస్ రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశంలో మాట్లాడుతూ, గిరిజన రైతులు మహిళలు ఈ సంఘంలో సభ్యులుగా చేరి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి పథకాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కె.మొస్య., సంస్థ మండల కోఆర్డినేటర్ డి.మోషే. ఎస్.అర్జున్, అకౌంటెంట్ కె. సరస్వతి సభ్యులు పాల్గొన్నారు

రియల్టర్ దౌర్జన్యంపై వెల్లువెత్తిన నిరసన

• గిరిజనేతర భూస్వామి, అతని అనుచరులపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆందోళన



అనంతగిరిలో ఆందోళన చేపట్టిన జెడ్‌పిటిసి గంగరాజు, సిపిఎం, గిరిజన నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి : గిరిజన సంఘం నాయకుడిపై దాడికి ప్రోత్సహించి, హత్యాయత్నానికి కారకుడైన గిరిజనేతర భూస్వామి బి.నగేష్ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. కబ్జా చేసిన ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలన్నారు. గిరిజన సంఘం నేతలపై దాడి ఘటనను ఖండిస్తూ బాధితులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో మంగళవారం మండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. భూస్వామి నగేష్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వ భూమి పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా గంగారాజు మాట్లాడుతూ, ప్రభుత్వ సీలింగ్, బంజరు, గెడ్డపోరంబోకు భూముల పరిరక్షణకు సిపిఎం, ఆదివాసీగిరిజన సంఘంపోరాటం చేస్తోందన్నారు ఈ క్రమంలోనే సరియాపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై ప్రశ్నిస్తే గిరిజన సంఘం మండల నాయకుడు జేష్ఠ వెంకపరమణ, ఆర్ .శ్రీనివాస్‌లపై భూస్వామి అనుచరులు దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు, అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. తక్షణమే తగు చర్యలు చేపట్టకుంటే జిల్లా ఎస్‌పి కార్యాలయం ముట్టడించక తప్పదని హెచ్చరించారు. ఆందోళనలో టోకూరు సర్పంచ్ కిల్లో. మొస్య, భీంపోలు వార్డు సభ్యులు గెమ్మెల. సింహాచలం, సిపిఎం మండల సీనియర్ నాయకులు జమ్మల దేవన్న, పీసా కమిటీ సభ్యులు జె. భీమన్న, కాకర. సింగులు పాల్గొన్నారు

హుకుంపేట: గిరిజన చట్టాలను ఉల్లంఘించి, ఏజెన్సీలో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలను నిర్వహించడమే కాకుండా, ప్రభుత్వ భూమి దురాక్రమణపై ప్రశ్నించారని స్థానిక గిరిజన నేతపై దాడి చేయడం దుర్మార్గమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకురాలు సొంట్యాన హైమావతి, తాపుల కృష్ణారావు ఆరోపించారు. అనంతగిరి మండలంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు జేష్ఠ వెంకటరమణ, ఆర్ శ్రీనుపై దాడికి పాల్పడిన గిరిజనేతర భూస్వామి బి నగేష్‌పై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడి ఘటనను ఖండిస్తూ మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ సీలింగ్ భూమి ఆక్రమించిన గిరిజనేతర భూస్వామిపై 2024 లాండ్ గ్రాబింగ్ చట్టం, అట్రాసిటీ చట్టాల కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. నిరసనలో సిపిఎం మండల కార్యదర్శి మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణరావు, వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, తడిగిరి, కొంతిలి వైస్ సర్పంచ్‌లు కిల్లో రామారావు, డూరు కృష్ణమూర్తి, నాయకులు గెమ్మలి ఆనంద్, కొర్ర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో ఆదివాసీ గిరిజన సంఘం నేతల నిరసన

ఆదివాసీ నేతలపై దాడి హేయం

పాడేరు: అనంతగిరి మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు చేసిన ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకుడు జేష్ఠ.వెంకటరమణ, ఆర్ శ్రీనులపై భూస్వాముల దాడి హేయమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసీ నేతల ఫిర్యాదులపై అధికారులు స్పందించి, పరిశీలనకు వెళ్లిన నేపథ్యంలో దాన్ని జీర్ణించుకోలేని భూబకాసురులు, రియల్టర్ అనుచరులు వెంకటరమణ ఇంటికి వెళ్లి భయాందోళనకు గురిచేసి, ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని బయటకు లాగి విచక్షణారహితంగా దాడి చేయడం దారుణమన్నారు. బాధ్యులను.తక్షణమే అరెస్టు చేయాలని, ప్రభుత్వ భూములు, ఆదివాసీలకు రక్షణ కల్పించాలని కోరారు

ఆక్రమిత ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

అనంతగిరి : మండలంలోని భీంపోలు పంచాయతీ సరియాపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 66 లో ఉన్న 13 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఆరోపణలు నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ అధికారులు ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇటోరి వెంచర్ కంపెనీకి చెందిన బి నగేష్ అనే గిరిజనేతరుడు అక్రమంగా కబ్జాకు పాల్పడి, జెసిబితో భూమిని చదును చేశారని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు శ్రేష్ఠ .వెంకటరమణ ఆర్. శ్రీనివాసు ఫిర్యాదు మేరకు రెవిన్యూ అధికారులు స్పందించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ మాణిక్యం ఆదేశాల మేరకు విఆర్‌ఒ, సర్వేయర్‌లు పరిశీలన చేశారు. అయితే దానిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆదివాసీ గిరిజనసంఘం, సిపిఎం ఆందోళన నేపథ్యంలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వచ్చి, ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై తహశీల్దార్ వివరణ కోరగా ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్, ఆర్‌ఐ పి.శంకరరావు, విఆర్‌ఒ ఆశ, సర్వేయర్ భాస్కరరావు సిబ్బంది పాల్గొన్నారు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

'రియల్' మాఫియాపై చర్యలు తీసుకోండి



ఆసుపత్రిలో వెంకటరమణను పరామర్శిస్తున్న బాలదేవ్, ఇతర నేతలు

అరకులోయ : అనంతగిరి మండలం గిరిజన నాయకుడు జేష్ఠ వెంకటరమణపై గిరిజనేతర భూస్వామి బి.నగేష్, అతని అనుచరులుదాడి చేయడం అత్యంత హేయమనిఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. బాధ్యుడైన భూస్వామి నగేష్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినచర్యలు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. మంగళవారం భూస్వామి దాడిలో గాయపడి, అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణను పొద్దు బాలదేవ్‌తోపాటు మండల నాయకులు కిల్లో జగన్నాథం, కె. సహదేవ్ తదితరులు పరామర్శించారు.

ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూమి కబ్జా చేయడమే కాకుండా, ప్రశ్నించిన గిరిజన నాయకుడుపై దాడికి పాల్పడడం దుర్మార్గమని, బాధ్యుడిని తక్షణమే అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు. భీంపోలు పంచాయతీ సరియాపల్లిలో సర్వేనెంబరు 66లో 13 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జా చేసిన విటోరి రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని దుర్మార్గాలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారని కక్ష గట్టి, ఇంటికి వెళ్లి బెదిరించడమే కాకుండా, ఏకంగా దాడిచేసి గాయపరచడం దుర్మార్గమన్నారు. గిరిజన నేతలు వెంకటరమణ, ఆర్.శ్రీనులపై దాష్టీకానికి పాల్పడిన గూండాలను శిక్షించాలన్నారు. మన్యంలో ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, నాన్‌షెడ్యూల్ ప్రాంతాన్ని షెడ్యూల్డ్ ప్రాంతంగా గుర్తించి,ఆదివాసీల భూములు, అడవులను పరిరక్షించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, ప్రజాప్రతినిధులు

ప్రాధాన్యత గ్రామాలకు వెంటనే ప్యాకేజీ ఇప్పించండి

- ఆర్ అండ్ ఆర్ అధికారికి సిపిఎం ప్రజాప్రతినిధుల వినతి

ప్రజాశక్తి-కూనవరం

ఏటా మునుగుతూ ఇబ్బంది పడుతున్న ముంపు గ్రామాలలో కొన్నింటిని గుర్తించడం జరిగిందని, ఆ ప్రాధాన్యత గ్రామాలకు వెంటనే ప్యాకేజీ ఇప్పించాలని సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో ఆర్ అండ్ ఆర్ అధికారిని సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ప్యాకేజీ పెంచి ఇచ్చి నిర్వసితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతి నిర్వసితుడికీ రూ.10 లక్షలు నష్ట పరిహారం అందించాలని కోరారు.

స్థానిక సమస్యలపై వినతి

అనంతరం ఐటిడిఎ ఏపిఓని కలిసి స్థానిక సమస్యలు, రోడ్లు, సమస్యలపై సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు వినతి పత్రం అందజేశారు. పాఠశాల భవనాల మరమ్మతుల గురించి వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిస్కారమయ్యేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, సర్పంచ్‌లు నాగమణి, వెంకమ్మ, శంకర్, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు రేవతి

బాల్య వివాహాలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-సీలేరు

బాల్య వివాహాలకు స్వస్తి పలకాలని సీలేరు గ్రామ సచివాలయం మహిళా పోలీస్ రేవతి అన్నారు. జికె.వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా రేవతి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై వివరించారు. ఆడపిల్లలు నిర్ణీత వయసు రాకముందే వివాహాలు చేసుకోవడం వలన పిల్లలు అంగవైకల్యంతో పుట్టే అవకాశం ఉందని తెలిపారు. అలాగే కాన్పు కలిగేటప్పుడు గర్భిణులు అనేక సమస్యలు ఎదుర్కొంటారన్నారు. డెలివరీ సమయంలో శిశువు మరణించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు దాటిన తర్వాత పెళ్లి చేసుకుంటే ఈ సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శంకర్రావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.శ్రీను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

గర్నేటి సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం మాజీ సర్పంచ్ భద్రాచలం డివిజన్ సిపిఎం నిర్మాతల్లో ఒకరైన గర్నేటి సుబ్బారావు 10వ వర్ధంతి స్థానిక మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో మంగళవారం నిర్వహించారు. సుబ్బారావు చిత్ర పటానికి గర్నేటి సీతయ్య, ఇతర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు గడ్డిపాటి షణ్ముకేశ్వరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ మండల కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుబ్బారావు కూనవరం సర్పంచిగా అనేక సేవలు అందించారని తెలిపారు. విద్యాభివృద్ధి పట్ల ఆయన అంకితభావంతో ఉండేవారని, జూనియర్ కాలేజీ ఈ ప్రాంతంలో రావడానికి, దానికి స్థలం ఇప్పించడంలో ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. పార్టీ నియమాలకు కట్టుబడి మండలంలో పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపారని తెలిపారు. ఆయన ఆశయ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ సభ్యులు తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి కొండ ఈశ్వర్లు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని వాతంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆ పాఠశాలలో చదువుతున్న 94 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్, బరువు, ఎత్తు, రక్తపోటు వంటి పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యార్థినులు రక్తహీనతకు గురికాకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లక్ష్మి, శామ్యూల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిడి

• ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళనకు స్పందన



ఆశ్రమ పాఠశాలలో పరిస్థితులపై ఆరా తీస్తున్న డిడి రజని

ప్రజాశక్తి హుకుంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాల -1ను గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజని సోమవారం రాత్రి సందర్శించారు. హాస్టల్‌లో నిబంధనల మేరకు మెనూ అమలు కావడం లేదని, వార్డెన్ ఇష్టానుసారంగా తోచింది వండిపెడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేసిన నేపథ్యంలో దీనిపై ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఫోను ద్వారా సమస్యలను డిడికి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆమె ఫోనులోనే తాను హాస్టల్ పరిశీలనకు వచ్చి, అక్కడి పరిస్థితులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

ఇచ్చిన మాట ప్రకారం సోమవారం రాత్రి హాస్టల్ తనిఖీకి వచ్చిన డిడి రజని, విద్యార్థుల ఆందోళన, హాస్టల్‌లో పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులను ప్రశ్నించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయితే ఇంత జరిగినా, హాస్టల్‌లో మెనూ సరిగా అమలు చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన వార్డెన్ పాడి పూర్ణరాజుపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించకుండా, ఆయననే కొనసాగించడంపై విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఆక్షేపిస్తున్నారు.తక్షణమే తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వార్డెన్‌పై తగు చర్యలు చేపట్టకుంటే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లక తప్పదని ఎస్‌ఎఫ్‌ఐ, ప్రజాసంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

పిఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఎంపిడిఒలతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు : ప్రధానమంత్రి జన్‌మన్ కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు.. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి గృహనిర్మాణాలు, డిఆర్‌డిఎ నైపుణాభివృద్ధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు వంటి అంశాలపై ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు 23,654 ఇళ్లను మంజూరు చేయగా, 17,382 నిర్మాణాలు ప్రారంభించారని 6273 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. ప్రతిరోజూ 50 గృహాల నిర్మాణాలు ప్రారంభించాలని స్పష్టం చేసారు. బ్యాంకు లింకేజీ 47 శాతం మాత్రమే సాధించారని, అర్హత కలిగి సంఘాలకు బ్యాంకు లింకేజీ అందించాలని సూచించారు. స్త్రీ నిధి చెల్లింపులలో జాప్యం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.ఉపాధి హామీ పథకంలో లేబర్ మొబలైజేషన్ పెంచాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ఉపాధి పనులు కల్పించడం అలసత్వం ప్రదర్శిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. చిన్న పిల్లల ఆధార్ అప్డేషన్ చేయాలని సూచించారు.

సమావేశంలో పర్చువల్‌గా ఐటిడిఎ పిఒలు వి.అభిషేక్, కె.సింహాచలం పాల్గొన్నారు. సమీక్షలో హౌసింగ్ ఇఇ బి.బాబు, డిఆర్‌డిఎ పిడి మురళి, డ్వామా పిడి. విద్యాసాగర్, డిఎల్‌పిఒ పిఎస్. కుమార్ పాల్గొన్నారు.

ఎఒబిలో పోలీసుల అలర్ట్

- విస్తృతంగా తనిఖీలు
- అటవీ ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్
- మావోయిస్టు సానుభూతిపరులపై నిఘా



అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్తున్న ప్రత్యేక బలగాలు

ప్రజాశక్తి-సీలేరు

చతీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు మందు పాత్ర పేల్చడంతో 9 మంది జవాన్లు మృతి చెందిన నేపథ్యంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు అలర్ట్ అయ్యారు. సరిహద్దు అటవీ ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అణువణువూ గాలిస్తున్నారు. మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా పోలీసులు ఏఓబిని జల్లెడ పడుతున్నారు.

కొన్నాళ్లుగా చతీస్‌ఘడ్ సరిహద్దుల్లో వేల సంఖ్యలో కేంద్ర పోలీసు బలగాలను మోహరించి మావోయిస్టులను పెద్ద మొత్తంలో హతమార్చిన విషయం విదితమే. 2024లో సుమారు వందమందికి పైగా మావోయిస్టులను హతమార్చి పోలీసులు పైచేయి సాధించారు. దీంతో మావోయిస్టులకు కోలుకోవాలని దెబ్బ తగిలింది. దీంతో మావోయిస్టులు పోలీసులను ఎదురు దెబ్బతీయడానికి వ్యూహ రచనలు చేసి బీజాపూర్ జిల్లా కుత్ర అటవీ ప్రాంతంలో పోలీస్ బలగాలు వెళ్తున్న వాహనమే లక్ష్యంగా శక్తివంతమైన మందు పాత్రను పేల్చి పోలీసులను హతమార్చారు.

ఈ ఘటనతో సరిహద్దు పోలీసులు ఉలిక్కిపడ్డారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి సంఘటనలు ఎదురు కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ మేరకు మంగళవారం ఉదయం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో వచ్చే పోయే వాహనాలను ఒరిస్సా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సరిహద్దు గిరిజన గ్రామాల్లో పోలీసులు మకాం వేసి మావోయిస్టుల ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. మావోయిస్టు సానుభూతిపరులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టారు. సరిహద్దు అవుట్ పోస్టులలో అదనపు బలగాలు మొహరించి భద్రత మరింత కట్టు దిట్టం చేశారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మంగళవారం అధిక సంఖ్యలో పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపడుతుండడంతో ఏం జరుగుతుందో తెలియక గిరిజనులు భయాందోళనకు గురయ్యారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గిరిజనులు భయపడుతున్నారు.

కోరం లేక మూడోసారి పీసా గ్రామసభ వాయిదా

బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలి : ఆదివాసీ జెఎసి

ప్రజాశక్తి- దేవీపట్నం

దేవీపట్నం మండలం, ఇందుకూరు రెవెన్యూ గ్రామంలో మంగళవారం జరిగిన పీసా గ్రామసభ కోరం లేక మూడో సారి వాయిదా పడింది. గ్రామ పంచాయితీ సెక్రటరీ సత్యనారాయణ సమక్షంలో పీసా గ్రామసభ స్థానిక సర్పంచ్ కోసు లక్ష్మణ్ అధ్యక్షతన ప్రారంభమైంది. అయితే గ్రామసభ నిర్వహణకు అవసరమైన మేరకు ఓటర్లు రాకపోవడంతో వాయిదా వేసినట్టు ఎన్నికలు అధికారి వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ మన్యం ప్రాంతంలో అనేక గ్రామ పంచాయితీలలో కోరం లేదని కారణంతో పీసా గ్రామసభ ఎన్నికలను వాయిదాలు వేస్తున్నారని తెలిపారు. ఇలా అయితే షెడ్యూల్డ్ ప్రాంతంలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఇందుకూరు గ్రామంతో పాటు సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో పీసా గ్రామసభ ఎన్నికలకు బ్యాలెట్ ఓటింగ్ సిస్టం (సీక్రెట్ ఓటింగ్) ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పీసా గ్రామసభ ఎన్నికలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల జోక్యం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.



గ్రామసభకు పల్చగా వచ్చిన జనం

పనులు ప్రారంభించకుంటే కాంట్రాక్టు రద్దు

మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశం

ఇంజినీరింగ్ పనులపై సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లా వ్యాప్తంగా అన్ని ఇంజినీరింగ్ పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన రహదారులు, భవన నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాలు, సామాజక భవనాలు, వెల్నెస్ సెంటర్లు. బర్త్ వెయిటింగ్ హాల్స్, గోకులం షెడ్ల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంజూరైన పనులు ప్రారంభించకుంటే ఈనెలాఖరులోగా ప్రారంభించాలని ఆదేశించారు. ఆర్టికల్ 275, సిసిడిపి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరు చేసిన పనులన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. . అరకు గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగంలో 24 పనులలో ఒకటి మాత్రమే పూర్తి చేసారని మిగిలిన 23 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చింతూరు డివిజన్, రంపచోడవరం డివిజన్లలో ఆర్టికల్ 275లో మంజూరు చేసిన పనులు మార్చి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేసారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టులను రద్దు చేస్తామన్నారు. పనులు మంజూరు చేసినా ఎందుకు ప్రారంభించలేదని ఆరా తీసారు. నిధులు వస్తున్నాయని మంజూరు చేసిన పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పాడేరు డివిజన్పరిధిలో 66 పనులు మంజూరు చేసామన్నారు.48 పనులుపురోగతిలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన పనులు త్వరితగతిన ప్రారంభించాలన్నారు. పనుల పురోగతి ఫోటోలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు కె. వేణుగోపాల్, జి. డేవిడ్‌రాజు, సిపిఒ ఎన్ఎస్ఆర్ కె. పట్నాయక్, పర్చువల్‌గా రంపచోడవరం, చింతూరు డిఇఇలు, ఎఇఇలు పాల్గొన్నారు



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - చింతపల్లి :సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించి మార్కెటింగ్ చేస్తే పట్టణాలలో ఉద్యోగాలు చేసి సంపాదించే వారి కంటే అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి అన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ, విశాఖపట్నం ఆత్మ సహకారంతో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సేంద్రియ వ్యవసాయంపై స్థానిక సహపరిశోధన సంచాలకులు డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రోజుల శిక్షణా తరగతుల ముగిసింది. ఈ సందర్భంగా సంజీవిని స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి దేవుళ్లతో కలిసి వివిధ అంశాలపై గ్రామీణ యువతకు అవగాహనతో పాటు నైపుణ్య శిక్షణ ఇచ్చారు. చదువుకున్న గ్రామీణ యువత ఉద్యోగాల కోసం నిరీక్షించి కాలాన్ని వృధా చేయకుండా, తమ గ్రామాల్లోనే దేశీ విత్తనాలను వినియోగించి సేంద్రియం, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించి మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా పట్టణాల్లో ఉద్యోగం చేస్తున్న వారి కంటే అధిక ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్వి నగర్ కాపీ పరిశోధన స్థానానికి చెందిన సాయిల్ సైన్స్ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ రాజీవ్ పాటి సేంద్రీయ పద్ధతిలలో కాఫీ తోటల సాగుపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కే బయ్యప్ప రెడ్డి, సందీప్ నాయక్, డాక్టర్ వెంకటేష్ బాబు, జోగారావు, ఉద్యానవన పరిశోధన స్థానం అధిపతి చెట్టి బిందు, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, గ్రామీణ యువత పాల్గొన్నారు.

వారపుసంతకు సంక్రాంతి కళ

వ్యాపారులు, గిరిజనులతో కిటకిట

జోరుగా సాగిన క్రయవిక్రయాలు


సంతబయలులోని వారపుసంత

ప్రజాశక్తి జి.మాడుగుల : మండల కేంద్రం సంతబయలులో మంగళవారం నిర్వహించిన వారపుసంత వ్యాపారులు, గిరిజనులతో కిక్కిరిసిపోయింది, ప్రతి మంగళవారం సంత బయలు గ్రామంలో వారపు సంత నిర్వహిస్తుండగా, సంక్రాంతి పండుగకు ముందువచ్చే సంతకావడంతో పండుగ సరుకులు కొనుగోలుకు, గిరిజన ఉత్పత్తులు అమ్మకానికి అటు వ్యాపారులు, ఇటు గిరిజనులు పెద్దఎత్తున తరలిరావడంతో సంతప్రాంగణం ఇసుకపోసినా రాలనంతంగా జనసంద్రంగా మారింది. గిరిజనులు తాము పండించిన కందులు, పసుపు, ఇతర అటవీ ఉత్పత్తులను వారపుసంతకు అమ్మకానికి తీసుకురాగా, వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో పండుగకు అవసరమైన సామగ్రితోపాటు నూతన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈసందర్భంగానే జోరా అంటూ ఇటు నేస్తాలు, అటు చుట్టాలను ఆప్యాయంగా పలకరించి, వారిని పండుగకు తమ ఇళ్లకు రావాలని ఆహ్వానించే తంతు ఆనవాయితీగా సాగింది.

సంక్రాంతి పండుగ సంతకావడంతో నర్సీపట్నం, చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం, వడ్డాది తదితర మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అధికసంఖ్యలో వచ్చి, సంతలో కందదుంపలు, గుమ్మడికాయలు, అరటికాయలు, ఇతర పండగకు అవసరమైన కాయగూయలు ఇతర సరుకులను కొనుగోలుచేశారు. వాటిని మైదానప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తారు. సంక్రాంతి పండుగ సంతకావడంతో పెద్దఎత్తున క్రయ విక్రయాలు సాగడంతో అటు వ్యాపారులు, ఇటు గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు, సంతలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సిఐ బి శ్రీనివాసరావు, ఎస్ఐ షణ్ముఖరావు, మహిళా పోలీసులు ఇతర పోలీసులతో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు ఏజెన్సీ వారపుసంత కావడంతో ప్రత్యేక నిఘాపెట్టారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు

ప్రజాభిప్రాయ సేకరణలో వర్చువల్‌గా పాల్గొన్న సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్


వర్చువల్‌గా ప్రజాభిప్రాయసేకరణ తిలకిస్తున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి- చింతపల్లి : విద్యుత్ స్మార్ట్‌మీటర్లు పెట్టి వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయొద్దని, పాత విధానం అమలు చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. విజయవాడలో నిర్వహిస్తున్న విద్యుత్ ప్రజాభిప్రాయ సేకరణను వర్చువల్‌గా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ గిరిజనులకు 200 విద్యుత్ యూనిట్లు వరకు ఉచితంగా ఇస్తామని నమ్మబలికి, ఇపుడు స్మార్ట్‌మీటర్ల పేరుతో కొత్త చిక్కులు తేవడం సరికాదన్నారు. ఆన్‌లైన్‌లో తూతూమంత్రంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయాన్ని సేకరించి, తర్వాత తాము అనుకున్నట్లు విద్యుత్‌ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు వంటి చర్యలకు పూనుకుంటారని ఆరోపించారు.స్మార్ట్‌మీటర్లు బిగింపును మానుకుని, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త విధానాన్ని రద్దు చేయాలని గత నెల 27న విద్యుత్ శాఖ నియంత్రణ మండలికి ఏడు అంశాలపై లేఖ పంపించామని, అయితే దానిపై ఎటువంటి స్పందన లేదన్నారు. 2025 26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్తు బిల్లులలో డిస్కౌంట్లు ఇవ్వాలని, విద్యుత్ ఛార్జీలు పెంచి గిరిజనులకు ఇబ్బందులు పెట్టొద్దన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించి, ప్రీపెయిడ్ విధానంలో విద్యుత్ ఛార్జీల వసూలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానంపై వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నకిలీ కుల ధ్రువీకరణలు రద్దుచేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గిరిజనేతరులకు జారీచేసిన నకిలీ ఎస్‌టి కుల ధ్రువీకరణలు రద్దు చేయాలని ఉపసర్పంచ్ జన్ని భగత్‌రాం డిమాండ్ చేశారు. మంగళవారం అరకులోయ మండలం పద్మపురం గ్రామ పంచాయతీలో రెవిన్యూ సదస్సులో ఎంపిటిసి, వార్డుసభ్యులు, పంచాయతీ పెద్దలతో కలిసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతంలో డెత్ సర్టిఫికెట్ సంబంధంతో లేకుండ గ్రామసభ పంచానామా ప్రతిపాదికన మ్యూటెక్షన్ ప్రక్రియ చేయాలన్నారు. డెత్ సర్టిఫికెట్‌తో అనుసంధానించడంతో చాలామంది గిరిజనులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, పనులు జరగక పట్టాలు మార్పిడి చేయించుకోలేకపోతున్నారని అన్నారు. పద్మాపురం పంచాయతీలో అనుమతి లేని కమర్షియల్ భవన నిర్మాణాలు, భారీ ఎత్తున అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, వాటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఒ.రాజ్ కుమార్, పీసా కమిటీ కార్యదర్శి రాజా , ఎస్ గోపి గ్రామ పెద్దలు కె రాము, పి సన్యాసి ,ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మినీ రిజర్వాయర్లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: కొర్రాయి పంచాయతీ కేంద్రంలో మినీ రిజర్వాయర్‌లో పడి గిరిజనుడి మృతి చెందిన విషాదకర సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలివి. కొర్రాయి గ్రామానికి చెందిన పి వెంకటరావు(44) అనే గిరిజనుడు ఉదయం ఏడు గంటలకు మినీ రిజర్వాయర్ గట్టులో కాలకీత్యాలు తీర్చుకునేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు రిజర్వాయర్లో నీటిలో గల్లంతయ్యారు. స్థానికుల సాయంతో గాలించిన వెంకటరావు ఆచూకి లభించలేదు. దీంతో ఆ పంచాయతీ సర్పంచ్ పి కొములు, బాధిత కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మృతదేహన్ని వెలికి తీశారు. మృతదేహన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. శవ పంచానామ నిర్వహించి బాధిత కుటుంబీకులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.


బైక్‌పై తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు

32 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండల కేంద్రం సమీపంలోని కొత్తూరు జంక్షన్ వద్ద మంగళవారం స్థానిక పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో గోనెసంచులో నింపిన 32 కిలోల ఎండు గంజాయి పట్టుబడిందని స్థానిక సీఐ బి శ్రీనివాసరావు తెలిపారు. నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సిఐ తెలిపిన వివరాలివి. పెదబయలు మండలం వెల్లపాలెం గ్రామానికి చెందిన కిల్లో సుబ్బారావు,కిల్లో జ్యోతి ద్విచక్ర వాహనంపై గంజాయిమూటను పెట్టుకుని, బైక్‌పై జిమాడుగుల నుండి పాడేరు వైపు వెళుతుండగా, పోలీసుల వాహన తనిఖీల్లో పట్టుబడ్డారు. నిందితులిద్దర్నీ అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

చురుగ్గా రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- పెదబయలు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి జిల్లా శాఖ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ ఎఎస్, దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ బృందం మంగళవారం సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు బృందం పెదబయలు మండలంలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశమై ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం నమోదుపై అవగాహన కల్పించి దరఖాస్తులను అందజేశారు. విద్యార్థులకు సమాజంపై, అవగాహన కల్పించి భవిష్యత్ కార్యాచరణ ఆరోగ్య సూత్రాలను వివరించారు. మండలంలోని తురకలవలస, అరడకోట, పెదబయలు బాలుర -1 బాలుర -2 జిల్లా పరిషత్ పాఠశాల, బాలికల -1 కేజీబివి పాఠశాలలను సందర్శించి రెడ్‌క్రాస్ కార్యాచరణ ను వివరించారు. కార్యక్రమం లో రెడ్ క్రాస్ సోసైటీ జిల్లా కోశాధికారి పి సూర్య రావు, సభ్యులు టీ ప్రసాద్ నాయకుడు, జిల్లా కోఆర్డినేటర్ వి లోహితస్ పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిల పంపిణీ

ప్రజాశక్తి -దుంబ్రిగుడ:మండల కేంద్రంలో క్రాప్‌జోన్ ఎగ్రో పారేస్ట్రీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పలు గిరిజన కుటుంబాలకు పొగరాని పొయ్యిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డివిజనల్ కోఆర్డినేటర్ రాంనాయుడు, మండల కోఆర్డినేటర్ గోపినాథ్ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 10వేల గిరిజన కుటుంబాలకు ఉచితంగా పొయ్యిలను పంపిణీ చేశామన్నారు. పొగరాని పొయ్యిల వాడకంతో కాలుష్య నియంత్రణతోపాటు శ్వాసకోశ వ్యాధులు దరిచేరవన్నారు.



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకటలక్ష్మి

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రెవెన్యూ సదస్సుల వల్ల భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, మండల తహశీల్దార్ అల్లు సత్యనారాయణ అన్నారు. రాజవొమ్మంగి సచివాలయంలో సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి, తాహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా ఏయే సమస్యలు పరిష్కారమవుతాయో వివరించారు. రైతుల అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కనిగిరి గంగాదుర్గా, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని కొల్లూరు గ్రామంలో మంగళవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలైన కొల్లూరు, గోందురు, పోచవరం గ్రామ ప్రజలకు పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు సరిగా లేవని, నీరు, విద్యుత్తు, విద్యాలయాలు, స్మశాన వాటికలు వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. నిర్వాసితులకు ఇచ్చిన వ్యవసాయ భూములు పంటలు పండించడానికి అనుకూలంగా లేవన్నారు. గిరిజనులు సాగు చేసే పోడు భూములకు కూడా భూమికి భూమి ఇవ్వాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం తహశీల్దారుకు అందించారు. దీనికి స్పందించిన తహశీల్దారు సరస్వతి మాట్లాడుతూ పైఅధికారులకు తెలియపరచి ఈ సమస్యలను పరిష్కరిస్తామనిహామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని శ్రీనగర్ కాలనీ దమ్మక్కపేటలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు తరుపున ఇంటి నిర్మాణ సామగ్రి అందజేశారు. దమ్మక్కపేట గ్రామానికి చెందిన సూట్రు వెంకటరామారావు నివాసం ఈ నెల 1వ తేదీన అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్ ఖాన్ మంగళవారం కుటుంబాన్ని పరామర్శించి, రూ.20వేలు విలువచేసే ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇనుప పైపులను, సిమెంట్ రేకులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, ఎస్టీ సెల్ నాయకులు కనితి మధు, నల్లజాల మధు, మండలాధ్యక్షులు పొట్టి రమేష్, సోడి నాగమణి, ఎస్కే రసూల్, రాచూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎఫ్‌పి గ్రూపు సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని 19 పంచాయితీల పరిధిలోని 200 ఎంఎఫ్‌పి గ్రూపుల సభ్యులకు శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపిఎం రామాంజనేయులు మాట్లాడుతూ ప్రధానమంత్రి వన్ ధన్ యోజన పేరుతో గిరిజనుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. గ్రూప్ పేరు, గ్రూప్ అధ్యక్ష, కార్యదర్శులు నియామకం, బుక్ క్లీఫర్ నియమించుకోవడం, బ్యాంకు ఖాతా తెరవడం, వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల కొనుగోలు తదితర అంశాలపై గ్రూపు సభ్యులకు, వివోఏలు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివోఏలు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్ల అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - దేవరాపల్లి : ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని నగరంపాలెం, చింతలపూడి ప్రాంతాల్లో అదానీ గ్రూపునకు చెందిన హైడ్రో పవర్ ప్లాంట్ల అనుమతులను రద్దు చేస్తూ ప్రకటన చేయాలంటూ నగరంపాలెం ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అడ్డాకుల టోపీలు ధరించి, విల్లంభులు ఎక్కుపెట్టి ఈ ఆందోళన చేపట్టారు. అదానీ చిత్రపటాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడారు.

సర్వం సిద్ధం

ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం - నేడు నగరంలో మోడీ రోడ్‌షో, బహిరంగ సభ

వర్చువల్ పద్ధతిలో పలు ప్రాజెక్టులు ప్రారంభం - పోలీసు వలయంలో ఎయు పరిసర ప్రాంతాలు

3 లక్షల మంది జన సమీకరణకు 'కూటమి' నేతల కసరత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

భారత ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేసింది. వారం రోజుల నుంచి పలువురు మంత్రులు, ఐఎఎస్‌లు విశాఖలోనే ఉంటూ ఈ ఏర్పాట్లను మంగళవారానికే ఓ కొలిక్కితెచ్చారు. విశాఖ నగరం పిఎం పర్యటన నేపథ్యంలో భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతున్నాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు ప్రధాని మోడీ చేరుకుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి ఎంపీ పురంధరేశ్వరి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు మోడీ పర్యటనలో భాగస్వాములు కానున్నారు. సాయంత్రం 4.45 నుంచి 5.30 గంటల వరకూ నగరంలోని వెంకటాద్రి వంటిల్లు నుంచి ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకూ మోడీ రోడ్డు షో ఉంటుంది. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.


ప్రధాని సభకు సిద్ధమైన వేదిక

7 వేల వాహనాలతో తరలింపు

ప్రధాని సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం 3 లక్షల మందిని సభకు తరలించే దిశగా కసరత్తు చేస్తోంది. ఆర్‌టిసి బస్సులు సహా 7 వేల వాహనాలను జనాలను తరలించేందుకు సమకూర్చారు.

4 వేల మంది పోలీసులతో బందోబస్తు

మోడీ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం 4 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తోంది. 35 మంది ఐపిఎస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎయు పరిసర ప్రాంతాల్లో డ్రోన్లను నిషేధించారు. బుధవారం స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలన్నిటికీ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఆంధ్రా యూనివర్శిటీలో బుధవారం జరుగనున్న అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, స్పెషల్ ఎగ్జామినేషన్స్ అన్నిటినీ వాయిదా వేశారు.


ఏర్పాట్లును పరిశీలిస్తున్న అనిత

ప్రధాని ప్రారంభించే ప్రాజెక్టులివే..

ఎయు గ్రౌండ్స్‌లోని బహిరంగ సభ ప్రాంగణం నుంచే జాతీయ గ్రీన్ హైడ్రోజనర్ మిషన్‌లో భాగంగా పూడిమడకలోని ఎన్‌టిపిసికి చెందిన రూ.1.85 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ప్రధాని మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. విభజన హామీల్లో భాగమైన దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు శంకుస్థాపన చేస్తారని తెలుస్తోంది. పారిశ్రామిక, మౌలిక వసతుల రంగాలకు సంబంధించిన కొన్ని ప్రాజెక్టులనూ మోడీ ప్రారంభించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రూ.19500 కోట్ల విలువైన రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ప్రధాని ఇక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత

ఎయు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. పోలీస్ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ప్రజలు ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. 2019 నుంచి 2024 వరకు పాయకరావుపేటలో ఒక్క కంపెనీ కూడా రాలేదని, ఇప్పుడు బల్క్ డ్రగ్ పార్క్ వంటివి రాబోతున్నాయని చెప్పారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.


ఎయు మైదానంలో సాగుతున్న భద్రతా ఏర్పాట్లు


కోటేశ్వరరావును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అడుగడుగునా నిర్బంధం

- సిపిఎం నాయకుల కదలికలపై పోలీసు నిఘా

- పలువురు హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి, ఎస్.రాయవరం, కశింకోట విలేకరులు

జిల్లాలో ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం వర్చువల్‌లో శంకుస్థాపన చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్కు ప్రాంతాల్లో ప్రభుత్వం మంగళవారం ఉదయం నుంచే పోలీసులను భారీగా మోహరించింది. సిపిఎం నాయకులపై అడుగడుగునా నిర్బంధం ప్రయోగించింది. పలువురిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద హైడ్రోజన్ హబ్‌కు, నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట వద్ద బల్క్ డ్రగ్ పార్కుకు ప్రధాని బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపన రద్దు చేయాలని మత్స్యకారులు, రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల బతుకులను దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపనను వ్యతిరేకిస్తూ నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన తెలపాలని సిపిఎం పిలుపునిచ్చింది. మోడీ సభకు, వర్చువల్ కార్యక్రమానికి వెళ్లకుండా నిరసన తెలపాలని ఇచ్చిన పిలుపునకు ప్రజల నుంచి స్పందన రావడంతో ప్రభుత్వం పోలీసులను దించింది. నిరసనలు జరగకుండా పలు చర్యలు చేపట్టింది. ప్రజలను బస్సుల్లో దగ్గరుండి తీసుకెళ్లే బాధ్యతను విఒఎ, విఆర్‌పిలకు అధికారులు అప్పగించారు. మోడీ సభ, శంకుస్థాపన సందర్భంగా ప్రజల నుంచి నిరసనలు లేకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నిర్వాసిత గ్రామాల్లో పోలీసులు సమూహంగా తిరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నక్కపల్లి, అచ్యుతాపురం సహా జిల్లాలోని సిపిఎం నాయకుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు.

ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు

నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ, విశాఖపట్నం-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని పోరాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజును మంగళవారం ఉదయం నుంచి ఎస్.రాయవరం మండలం ధర్మవరంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. సాయంత్రం నుంచి పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావును, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణను, పార్టీ అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము, మండల కమిటీ సభ్యులు సోమునాయుడు, కె.కోటపాడు మండల నాయకులు ఎర్రా దేముడు, కశింకోట మండల నాయకులు దాకారపు శ్రీనివాసరావు, డిడి.వరలక్ష్మి, నక్కపల్లి మండల నాయకులు ఎం.మహేష్ బాబు, మైలపల్లి జాను, మైలపల్లి బైరాగిరాజులను హౌస్ అరెస్టు చేశారు.

ప్రభుత్వ, పోలీసు తీరును ఖండించిన సిపిఎం

అక్రమ హౌస్ అరెస్టులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేయడమంటే ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేయడమే అవుతుందని పేర్కొన్నారు. పిఎం, సిఎం, రాష్ట్ర మంత్రుల పర్యటనల సందర్భంగా ముందుగా సిపిఎం నాయకులను నిర్బంధించడం, అరెస్టులు చేయడం పరిపాటిగా మారిందని తెలిపారు. గతంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎటువంటి అరెస్టులూ, గృహ నిర్బంధాలూ ఉండవని ప్రగల్భాలు పలికి నేడు అందుకు భిన్నంగా వ్యవహరించడాన్ని చూస్తే వారి మాటలకు, చేతలకు ఎంత తేడా ఉందో ఇట్టే అర్ధమవుతుందన్నారు. ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయడంలేదని ప్రకటించాలని డిమాండ్ చేశారు.